అయితే అది ఏడుస్తూ కూచోకుండా నోటి కొచ్చిన మాటల్లా అంటూంది. తల్లీ, కూతుర్నీ దుమ్మెత్తిపోస్తోంది. తన అమూల్యమైన కాలం ఆ 'దౌర్భాగ్యుల' దగ్గర ఎలా వృధాగా గడిచిపోయిందో, గోల పెడుతూంది. 'నీకు ముందుందిలే ముసళ్ల పండుగ— కూతురిసేతే లెంపకాయలు తిన్ననాడు తప్ప నీకు బుద్ధిరా'దని—శాపనార్థాలు పెడుతూంది. తన బతుక్కాలిపోయిందని, గొల్లుగొల్లుమనిపోతూ నానా రాద్ధాంతం చేస్తూంది.

పరిస్థితి ఆమూలాగ్రంగా అర్థమైంది మంగళకి. అటువంటి సమయంలో వాళ్ళ మధ్యకు వెళ్ళడం అట్టే శ్రేయస్కరం కాదని నిశ్చయించుకొని, అక్కడినుంచే వెనుదిరిగిపోయింది.

(సశేషం)

---

మరో మినీకథ :

# వన్ వే ట్రాఫిక్

"ఏం చెప్పు నీ వుద్దేశం చెప్పు ..."

"నేను చేసుకోను."

"నీకు వుద్యోగం వేయించేను."

"...."

"మీ కుటుంబం నానా బాధలూ పడుతుంటే మాటా డబ్బూ సాయం చేశాను."

"...."

"నా అవసరాలు మానుకొని వేలకు వేలు మీ కోసం ఖర్చు చేశాను."

"...."

"ఉద్యోగం లేకుండా ఎన్ని రోజులు ఎక్కడెక్కడో తిరిగావు."

"... ...."

"మీ నాన్న చనిపోయినప్పుడు మీ కుటుంబం ఎన్ని అవస్థలకు గురికావల్సి వచ్చిందో అప్పుడు మీ చుట్టాలందరూ నెగ్లెక్ట్ చేస్తే ఆదుకున్న దెవరు?"

".... . .. . ."

"మనిద్దరి మధ్యా స్నేహం అంత ప్రగాఢమైంది. ఈ రోజు నా చెల్లెలికి వేలకు వేలు పోసి మాంచి సంబంధం తేలేనని కాదు. నీలాంటి ప్రాణస్నేహితుణ్ణి నా చెల్లెలి భర్తగా .ఓహ్ . స్నేహాన్ని బంధుత్వం క్రింద మార్చుకో గోపాల్ ..."

"...."

"మాట్లాడవేంరా .నా చెల్లెలు అందమైంది."

". . . ."

"డిగ్రీ వుంది, డిగ్నిటీ వుంది."

"కాదనను."

"డబ్బు వుంది. హోదా వుంది."

"కాదనను."

"నీతో క్లోజ్‌గా వుంటుంది కూడా. నీ అభిప్రాయం అడిగి తర్వాత రాధని కనుక్కుందామనుకుంటున్నాను."

"నేను ప్రేమించేను కూడా."

"మరెందుకు వద్దంటున్నావు?"

"రాధ ప్రేమించింది."

"ఎప్పుడు చెప్పింది?"

"నిన్ననే అడిగేను."

"మరేం ."

"నన్ను కాదు...."

—జి. గోపాలకృష్ణ